వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కోతలు లేవు



తోట్లవల్లూరు: వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు లేవని ఉయ్యూరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణానాయక్ తెలిపారు. మండలంలోని రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంక, పాములలంక ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి రైతులు వ్యక్తం చేసిన అనుమానాలను కృష్ణానాయక్ నివృత్తి చేశారు. తోట్లవల్లూరు విద్యుత్ సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల సందర్భంలోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. అంతేతప్ప ఎలాంటి అధికారిక కోతలు లేవని చెప్పారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్‌ను అందిస్తున్నట్లు రైతులకు వివరించారు. ఏఈఈ దేవదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి



ఎలకుర్రు(పామర్రు): మండల పరిధిలోని ఎలకుర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పులి అర్జునరావు ఇటీవల మృతి చెందారు. ఆదివారం మృతుని దశ దిన కర్మ కార్యక్రమానికి పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ పాల్గొని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు స్థానిక నాయకులు, స్థానికులుపాల్గొన్నారు.

కనకదుర్గా నమోస్తుతే..

కలిదిండి: దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కోటకలిదిండి గ్రామంలో ఆదివారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే డీఎన్నార్ భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. స్థానిక పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో పనుల్లో భాగంగా ఆలయము చుట్టూ నూతన ప్రాకార మండపం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన పూజా కార్యక్రమం జరుగుతుందని, ఎమ్మెల్యే దంపతులు పాల్గొంటారని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్త చిట్టూరి బుజ్జి, గుడివాడ ఫణికుమార్, మారుబోయిన విష్ణు, పేటేటి సత్యనారాయణ, వడుపు రమేష్, మంగినేని భాస్కరరావు, పోతురాజుల హరికృష్ణ, వడుగు సుబ్రహ్మణ్యం, వడుగు ఫణి, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరాయి. కైకలూరు శ్యామలాంబ అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఆలయ ఈవో వీఎన్‌కే.శేఖర్, చైర్మన్ గుర్రం రాంబాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు. కై కలూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెప్పర్ల మురళీకృష్ణ, కొప్పర్తి గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఆటపాక పార్వతీ సమేత కనకలింగేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీదేవి కనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గోనెపాడు గ్రామంలో కనకదుర్గమ్మ మహిషాసురమర్దనీ, ఆటపాకలో దుర్గాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ దర్శనమిచ్చారు. షిర్డీ సాయిబాబా ధ్యాన మందిర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబా దశావతార 30వ వార్షికోత్సవంలో భాగంగా బాబా బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మందిర కమిటీ చైర్మన్ కొనిజేటి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో...

కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మకు నూతన వస్త్ర, పుష్పాలంకరణ, సుగంధ పరిమళ ద్రవ్యార్చన, లలిత సహస్ర నామకుంకుమ పూజలు నిర్వహించారు. భుజబలపట్నంకు చెందిన ముదునూరి జానకి రవీంద్ర సుబ్బరాజు,రమాదేవి దంపతులు పూజలు చేశారు. ఉప ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు ఏర్పాట్లును పర్యవేక్షించారు.



కోటకలిదిండిలో అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

గుడివాడ టౌన్: దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించి ఆదివారం భక్తుల దర్శనానికి ఉంచారు. స్థానిక గౌరీశంకరపురంలో గౌరీశంకరస్వామి దేవస్థానంలో శ్రీ దుర్గా దేవిగా, శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం (పెద్దశివాలయం)లో, నీలామహల్‌రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలలో కనకదుర్గా దేవిగా, శంకర మందిరంలో విజయదుర్గా దేవిగా, వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంతాన లక్ష్మీదేవిగా, పిన్నమనేని నగర్ లోని నాగదుర్గాదేవి అమ్మవారి దేవస్థానంలో దుర్గా దేవిగా అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు.

పామర్రు: స్థానిక కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలోని అమ్మవారిని మహిషాసుర మర్దనీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలను చేయించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొగ్గరపు జాలయ్య, బి.సాయిబాబు, బి.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు ముత్తేవి మాధవ్ పాల్గొన్నారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ చైర్మన్ వరదా అప్పారావు పాల్గొన్నారు. సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా చండీయాగం

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని భీమేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో ఆదివారం మహా చండీయాగం నిర్వహించారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చండీయాగం నిర్వహించడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తోందని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. 52 మంది పుణ్య దంపతులు ఈ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఆదివారం శ్రీ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అల్లూరి శివకోటేశ్వరరావు దంపతులు పూజలు చేశారు. ఆలయ అర్చకుడు గూడూరు శ్రీనివాసరావు పూజలు జరిపించారు. కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వస్తివాచకులు హరి రవికుమార్, ద్వాదశి ఫణికుమార్, ద్వాదశి కామేశ్వరరావు పాల్గొన్నారు. లోకుమూడి దత్తాశ్రమంలో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్ కుంకుమార్చన నిర్వహించారు. చిన్నారులు గీతాశ్యామల, రాజేశ్వరి ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీనివాసరావు, మహాలక్ష్మి భక్తులకు సేంద్రియ నాటు విత్తనాలు పంపిణీ చేశారు. సాగిరాజు వెంకటరామరాజు దంపతుల అన్నప్రసాదం వితరణ చేశారు. మట్టా రాజేంద్రప్రసాద్, దేశంశెట్టి నానాజీ, కె శివ ప్రసాద్, రాగాల వెంకటేశ్వరరావు, బసవయ్య, ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు. స్థానిక విజయదుర్గ ఆలయం, లింగాల శివాలయంలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఆలయ పరిపాలనా భవనం ప్రారంభం



నూతన కార్యాలయంలో ఆశీనులైన ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

గుడివాడ టౌన్: స్థానిక భీమేశ్వర స్వామి దేవస్థానం (పెద్దశివాలయం)లో నూతనంగా నిర్మించిన పరిపాలనా కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, సమక్షంలో ఈ ఆలయ కార్యాలయం ప్రారంభించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ నిధులు రూ.20 లక్షలతో నూతన కార్యాలయాన్ని నిర్మించినట్లు ఎమ్మెల్యే కొడాలి నాని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రభుత్వానికి ఆ జగన్మాత ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాం బాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, మెరుగుమాల కాళీ, స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, పాలడుగు రాంప్రసాద్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

బాపట్ల ఎంపీ నందిగం సురేష్



ఏఎంసీ చైర్‌పర్సన్ నాగమణి విక్టర్‌ను అభినందిస్తున్న ఎంపీ నందిగం, పామర్రు ఎమ్మెల్యే కైలే

గుడివాడరూరల్: గుడివాడ మార్కెట్‌యార్డ్ పరిధిలోని రైతుల సంక్షేమానికి కృషి చేయాలని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్‌కు సూచించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ స్వగృహాన్ని ఎంపీ నందిగం సురేష్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సందర్శించారు. ఇటీవల మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాగమణివిక్టర్‌కు బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ నందిగం మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సేవలను యార్డ్ పరిధిలోని రైతులకు అందించాలని కోరారు. గుడివాడ ఎంపీపీ గద్దే పుష్పరాణి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గద్దే వెంకటరామాంజనేయులు (రాము), నైనవరపు శేషుబాబు, నవీన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పామర్రు: మండల పరిధిలో శిబిరంపై ఆదివారం దాడి చేసి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండిపర్రు గ్రామంలోని చెరువు గట్టున పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడులు చేయగా నలుగురు పరారవగా ముగ్గురు చిక్కారు. వారి నుంచి రూ.3,100 నగదుని స్వాధీనం చేసుకున్నామని ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

పామర్రు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పామర్రు గ్రామంలోని అరండాల్‌పేటకు చెందిన పామర్తి రామకృష్ణ, లలితలకు 12 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఒక కుమార్తె ఉంది. ప్రతి రోజూ అదనపు కట్నం తీసుకురావాలని తన అత్త, బావ, ఆడపడుచు శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని లలిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త వికలాంగుడు కావడంతో స్థానికంగా ఉంటున్న ముద్దినేని దుర్గానాయుడు అనే వ్యక్తి తన సమస్య పరిష్కరిస్తానంటూ అసభ్యంగా ప్రవర్తిస్తూ , మాట వినక పోతే చంపుతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా కొడాలి నాని పుట్టిన రోజు వేడుక

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ నందిగం సురేష్, కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, గుడివాడ, నందివాడ తహసీల్దార్‌లు కె.ఆంజనేయులు, వి.భవన్నారాయణ, పలుశాఖల అధికారులు, వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్, టూటౌన్ సీఐ బి.తులసీధర్, రూరల్ సీఐ ఏసుబాబు, వన్‌టౌన్ ఎస్‌ఐ గౌతమ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ శ్రీనివాస్, తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు.



ఎమ్మెల్యే నానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారులు

అభిమానుల అన్నదానం..

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆయన అభిమానులు పట్టణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అభిమానులు వెయ్యి మందికి చికెన్ బిర్యానీ పంపిణీ చేశారు. తొలుత ఎమ్మెల్యే నాని పుట్టినరోజు పురస్కరించుకుని భారీ కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు యలమర్తి కృష్ణారావు, సయ్యద్ గఫార్, సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్, పుట్టి హరికుమార్, బొగ్గారపు తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే నాని అభిమానులు

రూ.70 వేలతో రుద్రాక్ష మండపం ఏర్పాటు



గుడివాడ టౌన్: స్థానిక వాసవీ చౌక్‌లో కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని నగరేశ్వర స్వామి ఉపాలయానికి రుద్రాక్ష మండపం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు ఆదివారం తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భక్తులు పాల్గొనడం అభినందనీయం అని ఆయన అన్నారు. పాలక మండలి కోశాధికారి టంగుటూరి వెంకట సుబ్బారావు రూ.70 వేలుతో ఈ మండపం ఏర్పాటు చేశామన్నారు. దేవాలయ గుమ్మాలకు పేరూరి వెంకట సుబ్రహ్మణ్యం, చలువాది వెంకట మోహనరావు, తాళ్లూరి సురేష్, కొల్లిపర సాయి వెంకట రమణ, సనిశెట్టి వెంకట సుబ్బారావులు మరో ఉప ఆలయమైన జనార్దనస్వామి గుమ్మాలకు ఇత్తడి తొడుగు వేయించడానికి మండల బధిరీనాథ్, మరి కొందరు భక్తులు ముందుకు వచ్చారని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

మండవల్లి: మండలంలోని భైరవపట్నం గ్రామ సచివాలయానికి చెందిన గృహసారథి మోదుగుమూడి వెంకట్రావు ఇటీవల మృతి చెందాడు. వెంకట్రావు భార్య మంగమ్మకు వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం రూ.13 వేలు ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ నాగేంద్ర, ఎంపీటీసీ నాగదాసు కిరీటిరాజు, సచివాలయం కన్వీనర్‌లు వల్లూరి ఆదినారాయణ, బోయిన నాగరాజు, పార్టీ కార్యకర్తలు రాజబోయిన నాగు, గోల్కొండ గోపి, బోయిన గోపి ఆర్థిక సాయం చేసినవారిలో ఉన్నారు.

పామర్రు(మొవ్వ): మండల పరిధిలోని మంత్రిపాలెం గ్రామం శివారు చిన్న ఎస్సీ ఏరియాలో కడిమి సంధ్యారాణి ఇటీవల మృతి చెందింది. ఈనేపథ్యంలో మృతురాలి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలను ఆదివారం అందజేశారు. స్థానిక ఎంపీటీసీ కాకుమాని శ్రీలక్ష్మి, గ్రామ కన్వీనర్ కొల్లూరి సంజీవ్‌ల చేతుల మీదుగా ఈ సహాయం అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నదానానికి ఆదివారం రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపికి పెసరమిల్లికి చెందిన వల్లే ఈశ్వరరావు స్మారకార్థం కుమారుడు గంగాధరరావు ఈ విరాళం అందించారు. ఆయనకు అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.


విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో 2004-05 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు

పామర్రు(మొవ్వ): మండలంలోని కూచిపూడి గ్రామంలోని సిద్దేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2004-05 ఏడాదిలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో స్థిర పడిన పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో తరలి వచ్చారు. పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఎస్.నిరంజనరావు, కనకలింగేశ్వరరావు, డాక్టర్ ఎస్‌టీజీ శ్రీనివాసాచార్యులు, మాధవి, మోపిదేవి ఎంపీపీ వాణి, సత్యవతి, లక్ష్మీకుమారి, నైట్ వాచ్‌మెన్ రాంబాబు తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. చింతా పవన్, భరత్ స్వాగతం పలికి కార్యక్రమం నిర్వహించారు. కూచిపూడి నృత్యంతో ప్రారంభించారు. నాట్యాచార్యులుగా కొనసాగుతున్న వెంపటి సత్య ప్రసాద్, జోశ్యుల పవన్, మహంకాళి, ఫణి పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు..



గుడ్లవల్లేరు:కొండలమ్మ అమ్మ వారి సన్నిధిలో దుర్గాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి.ఆదివారం అమ్మవారు కనక దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి కుంభం పోశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి చేతుల మీదుగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ వేడుకలను ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఆధ్వర్యంలో చేపట్టారు. ఊరేగింపులో జానపద ఇంద్రజాల ప్రదర్శనలు, చిత్ర విచిత్ర వేషధారణలు, కనక డప్పుల వాయిద్యాలు, మేళతాళాలు, తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేలాది మందికి అన్నసమారాధన చేశారు.